
సాక్షి
వరంగల్
బుధవారం | 16 | ఏప్రిల్ | 2025



**స్టీమ్ టు వందేభారత్**
భారతీయ రైల్వే నేటితో 172 వసంతాలు పూర్తి చేసుకుంది. మొదటి స్టీమ్ లోకోమోటివ్ నుంచి ప్రారంభమై.. వందేభారత్ రైళ్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. - 8లో▸



**యథావిధిగా డిగ్రీ సెమిస్టర్లు**
కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల సెమిస్టర్ల పరీక్షలు యథావిధిగా ఇప్పటికే ప్రకటించిన టైంటేబుల్ ప్రకారమే నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^{0}/27^{0}$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండతీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలి



గీసుకొండ: జిల్లాలో గర్భిణులు, చిన్న పిల్లలను గుర్తించి క్రమంతప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు వైద్యాధికారులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, సూపర్‌వైజర్, సిబ్బంది స్పెషల్ ఇమ్యునైజేషన్ డ్రైవ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ.. అర్హులకు వ్యాధి నిరోధక టీకాల ఇవ్వాలని సూచించారు. ఈ స్పెషల్ ఇమ్యునైజేషన్ క్యాంపెయిన్ డ్రైవ్.. మొదటి దశ ఈనెల 21వ తేదీనుంచి 28 వరకు, రెండో దశ మే 21 నుంచి 28 వరకు, మూడో దశ జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. వ్యాధి నిరోధిక టీకా తీసుకున్న చిన్న పిల్లల వివరాలు యు- విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆచార్య, డాక్టర్ అర్చన, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన 'టెన్త్ స్పాట్'

విద్యారణ్యపురి: కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో ఈ నెల 7వ తేదీనుంచి ప్రారంభమైన టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ మంగళవారం సాయంత్రం ముగిసింది. అన్ని సబ్జెక్టులు, ఒకేషనల్ కోర్సుల పరీక్షల జవాబుపత్రాలు కలిపి 2,27,403 జవాబుపత్రాలు వచ్చాయి. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలనుంచి ఎస్‌ఏలు, ఎస్‌జీటీలను స్పాట్ విధులకు కేటాయించారు. సీఈలుగా 113మంది, ఏఈలుగా 676మంది ఎస్‌ఏలు, 224మంది ఎస్‌జీటీలు స్పెషల్ అసిస్టెంట్లుగా విధుల్లో పాల్గొన్నారు. హనుమకొండ డీఈఓ వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా, 8మంది పీజీహెచ్‌ఎంలు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా వ్యవహరించారు. ఈ నెల 30న లేదా మే మొదటివారంలో పరీక్ష ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### క్యాంపస్ ఇంటర్వ్యూలు

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిప్లొమా ఇన్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ అభ్యర్థులు అర్హులుగా, 18 నుంచి 24 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ప్రాంగణ నియామకాలకు 65 మంది విద్యార్థినులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

### మహిళల ఆర్థికాభివృద్ధికి డెయిరీలు



వరంగల్: మహిళలు ఆర్థికాభివృద్ధికి డెయిరీలు ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరకాల నియోజకవర్గంలోని బల్దియా పరిధిలో ఉన్న 15, 16, 17 డివిజన్లలో అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుకనూరు తరహాలో గీసుకొండ మండలంలోని వంచనగిరి, దామెర మండలంలో ఏర్పాటు చేయనున్న డెయిరీలకు స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ధర్మారం, గొర్రెకుంట గాడిపల్లి ప్రాంతాల్లో కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 66 డివిజన్లలో 2,057 జనాభాకు సరిపడా సీవేరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుపై బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హనుమకొండ, వరంగల్ డీఆర్డీఓలు శ్రీను, కౌసల్యాదేవి, బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, సీపీ రవీంద్రరాదేకర్, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, సెక్రటరీ అలివేలు, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, డీఎంసీ, టీఎంసీ ఉన్నారు.

### మహాసభను విజయవంతం చేయాలి

హన్మకొండ: తెలంగాణ ప్రజాఫ్రంట్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాలుగో మహాసభను విజయవంతం చేయాలని ఆ ఫ్రంట్ వరంగల్, హనుమకొండ జిల్లాల కన్వీనర్ జనగాం కుమారస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఆరోగ్యానికి బాటలు

**చిన్నారులు, బాలింతల సంరక్షణకు చర్యలు**
- రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాలు
- మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ



నల్లబెల్లి: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా ఆరోగ్య తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పోషణ్ అభియాన్–2025 పక్షోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందుకోసం 15 రోజుల్లో చేపట్టాల్సిన రోజువారీ ప్రత్యేక కార్యక్రమాలను రూపకల్పన చేసిన అధికారులు పక్కప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

**లబ్ధిదారుల గృహ సందర్శన**

అంగన్‌వాడీ లబ్ధిదారుల గృహాలను అంగన్‌వాడీ టీచర్లతోపాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు సందర్శిస్తారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు, కౌమార బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమ ఉద్దేశం, ప్రభుత్వ లక్ష్యాని వివరిస్తున్నారు. పోషక లోపం ఉన్నవారిని గుర్తించి అదనపు పోషకారం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్నారు. పోషక విలువలున్న ఆహార పదార్థాలు, ఆకు కూరలు, ప్రొటీన్స్, ఇతర బలవర్ధకమైన ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు బలవర్ధకమైన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటితోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నారు. పిల్లల్లో ఉబకాయం రాకుండా పాటించాల్సిన జీవన శైలి గురించి అవగాహన కల్పిస్తున్నారు.

**15 రోజులపాటు..**

ప్రతిరోజూ ఒక కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిర్వహించనున్నారు. మహిళ గర్భం దాల్చిన తర్వాత, కాన్పు అనంతరం తల్లి, శిశువు ఆరోగ్య సంరక్షణ ఎలా ఉండాలనేదానిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లులు బరువు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. మూడేళ్ల వరకు శిశువుల బాగోగులను ఎలా చూసుకోవాలనేది వివరిస్తున్నారు. పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ లబ్ధిదారులకు రక్తపరీక్షల శిబిరాలు చేపడుతున్నారు. పోషణలోపంతో బాధపడే పిల్లలను గుర్తిస్తున్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

**జిల్లా వివరాలు..**

| | |
|---|---|
| ప్రాజెక్టులు | 03 |
| అంగన్‌వాడీ కేంద్రాలు | 919 |
| గర్భిణులు | 4,720 |
| బాలింతలు | 4,134 |
| 0–3 ఏళ్ల చిన్నారులు | 26,142 |
| 0–6 ఏళ్ల చిన్నారులు | 21,120 |

**ఆరోగ్య తెలంగాణే లక్ష్యం**



చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రోత్సహిస్తూ ఆరోగ్య తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోషణ్ అభియాన్ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. పిల్లల ఎదుగుదల, తల్లీబిడ్డల ఆరోగ్యం తదితర వివరాలను తెలుసుకునేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పోషణ్ అభియాన్ రోజువారి కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహారంపై చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. 919 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నేటికి 16,120 పైగా కార్యక్రమాలు చేపట్టాం.
**- రాజమణి, జిల్లా సంక్షేమ అధికారి, వరంగల్**

# 'భూ భారతి'పై అవగాహన కల్పించాలి

**17వ తేదీ నుంచి అవగాహన సదస్సులు**
- టోల్ ఫ్రీ నంబర్ 040293 13999 ఏర్పాటు
- కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: ప్రభుత్వం అమలు చేయనున్న భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో భూభారతి చట్టంపై తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి హెల్ప్‌లైన్ నంబర్ 040293 13999 ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రచారం నిర్వహించాలని జిల్లా పౌరసంబంధాల అధికారి అయూబ్‌అలీని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందన్నారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సుల నిర్వహణలో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

**నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి**

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టర్‌లో ఎంపీడీఓలతో మంగళవారం వేసవి నీటి ఎద్దడి నివారణ, ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి మాట్లాడారు. పెరుగుతున్న ఎండ తీవ్రతకు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 30 నుంచి మే 31 వరకు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉంటుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గతంలో నీటి ఎద్దడి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్య పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఎంపీడీఓలు గ్రామాలను సందర్శించి ప్రజలకు సమస్య రాకుండా చూసుకోవాలని తెలిపారు. నియోజకవర్గాలవారీగా ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను మండల స్థాయి అధికారులు మరోసారి స్క్రూటినీ చేయాలని ఆదేశించారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**నకిలీ విత్తనాలను అరికట్టాలి**

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలను అధికారులు సమన్వయంతో అరికట్టాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో డీఏఓ అనురాధ అధ్యక్షతన విత్తన, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, వ్యవసాయ అధికారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వ్యవసాయాధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదు తీసుకోవాలన్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో డీలర్ల అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, ఏసీపీ కిరణ్‌కుమార్, ఏసీపీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వేతన వెతలు!



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌ఏలు(ఫైల్)



కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎఫ్‌ఏ రాజు (ఫైల్)

**జిల్లాలో 217 మంది ఎఫ్‌ఏలు**
- నాలుగు నెలలుగా వేతనాలకోసం ఎదురుచూపులు
- మంత్రులు, అధికారులకు వినతులు
- ఉద్యోగ భద్రత సైతం కరువు

ఖానాపురం: గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. వీరు నిత్యం ప్రజలకు పనులు కల్పించాల్సి ఉంటుంది. పనుల వద్ద అందుబాటులో ఉంటూ కూలీలకు సౌకర్యాలు కల్పిస్తూ పథకం అమలు చేయించడంలో వీరిదే ముఖ్యపాత్ర పోషిస్తారు. కూలీలకు వందరోజులపాటు పనులు కల్పిస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ తమకు గుర్తింపు లేకుండా పోతుందని ఎఫ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎఫ్‌ఏలు సమ్మెకు వెళ్లగా విధుల నుంచి తొలగింపునకు సైతం గురయ్యారు. నాడు విధుల్లోకి తీసుకోవాలని గత ముఖ్యమంత్రిని వేడుకున్న ఓ ఎమ్మెల్యే.. నేడు మంత్రిగా ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎఫ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో ఇలా..**

జిల్లా వ్యాప్తంగా 11 మండలాల పరిధిలో 74 వేల జాబ్ కార్డులకు సంబంధించి 1.25 లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్నారు. కూలీలకు క్షేత్ర స్థాయిలో పనులు కల్పించడానికి జిల్లా వ్యాప్తంగా 217 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లోనూ కొత్తగా ఎఫ్‌ఏలు విధుల్లోకి వచ్చారు. ఇందులో అన్నివర్గాలకు చెందిన పురుషులు, మహిళలు, దివ్యాంగులు సైతం ఉన్నారు. వీరంతా గ్రామాల్లో సంవత్సరానికి సరిపడా ఉపాధి పనులు గుర్తించి జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పిస్తున్నారు. పనులు జరిగే చోట ఉదయం, సాయంత్రం కూలీల హాజరు నమోదు చేసుకుంటారు. కూలీల నుంచి పనుల దరఖాస్తులను తీసుకుని పనులు కల్పించడం, చేసిన పనులకు కొలతలు తీసుకునే క్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లకు సహకారంగా ఉండడం, జాబ్ కార్డుల అప్డేట్, కూలీల వివరాలు నమోదు, నర్సరీ నిర్వహణతో పాటు పలు రకాల పనుల్లో భాగస్వాములవుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉద్యోగ భద్రత కరువు..**

ఎఫ్‌ఏలకు ప్రభుత్వం కేటగిరీల్లో వేతనాలు అందజేస్తోంది. మొదటి కేటగిరి కింద రూ.12,120, ద్వితీయ కేటగిరిలో రూ.10,800, తృతీయ కేటగిరీలో రూ.8,900 వేతనాలు ఎఫ్‌ఏలకు అందుతున్నాయి. కేటగిరీ పద్ధతుల్లో వేతనాలు మంజూరు చేయకుండా ఉద్యోగ భద్రత కల్పిస్తూ పే స్కేల్ అందించాలనే డిమాండ్‌తో గతంలో సమ్మెకు వెళ్లారు. దీంతో సుమారు మూడేళ్ల పాటు విధులకు దూరమయ్యారు. ఆతర్వాత మళ్లీ విధుల్లోకి వచ్చినప్పటికీ వారి సమస్యలు తీరకుండానే పోయాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో జీతాల పెంపు, ఎఫ్‌ఏల రెగ్యులరైజ్ చేస్తామని పెట్టడంతో సంతోషపడ్డారు. కానీ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌లు, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు నెలలుగా వేతనాలు బంద్**

జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఎఫ్‌ఏలకు నాలుగు నెలలుగా వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు పనులు తప్పనిసరిగా కల్పించాల్సి ఉండడంతో ఇతర ఏ పనులు చేసుకోవడానికీ ఎఫ్‌ఏలకు వీలు లేకుండాపోతోంది. ఇలా వచ్చే జీతంపై ఆధారపడుతున్న ఎఫ్‌ఏలకు నాలుగు నెలలుగా వేతనాలు దూరం కావడంతో దుర్భర జీవితాలను గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలు రావడంతో అవస్థలు పడుతున్నప్పటికీ, వచ్చే కొద్దిపాటి వేతనాలు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు.

**వేతనాలు మంజూరు చేయాలి..**



నాలుగు నెలలుగా వేతనాలు రావట్లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఉపాధి పనుల వద్ద నిత్యం కూలీలకు పనులు కల్పిస్తూ అందుబాటులో ఉంటున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే వేతనాలు మంజూరు చేయించి ఆదుకోవాలి.
**- వేల్పుల రాజు, ఎఫ్‌ఏ, మనుబోతులగడ్డ**

**ఉద్యోగ భద్రత కల్పించాలి..**



ఎఫ్‌ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలి. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎఫ్‌ఏల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి.
**- కేలోతు స్వామిచౌహాన్, ఎఫ్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు**

# కళాభవనం.. టాక్సీ అడ్డా..

**నిధులు లేక పూర్తికాని మినీ రవీంద్రభారతి**
- 12 సంవత్సరాలుగా పిల్లర్లకే పరిమితం
- తూర్పు నేతల నిర్లక్ష్యమే కారణమంటూ విమర్శలు





టాక్సీల స్టాండ్‌గా మారిన స్థలం (ఇన్‌సెట్‌లో) అసంపూర్తిగా ఉన్న కళాభవనం పిల్లర్లు

వరంగల్: కళాకారులను ప్రోత్సహించేందుకు వరంగల్ నగరంలో మంజూరు చేసిన మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ (మినీ రవీంద్రభారతి) నిర్మాణ స్థలం ప్రస్తుతం టాక్సీల స్టాండ్‌గా మారింది. 24–05–2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.నాలుగు కోట్ల నిధులు మంజూరు చేయగా.. ఏడాదిలో నిర్మించాలన్న నిబంధనలతో హైదరాబాద్‌కు చెందిన శ్రీకో సంస్థ ప్రాజెక్టు పనులు దక్కించుకుంది. మొదటి విడత పర్యాటక శాఖ నుంచి కళాభవనం నిర్మాణానికి కోటి రూపాయల నిధులు విడుదల చేయగా పనులు ప్రారంభమయ్యాయి. బెస్‌మెంట్‌తోపాటు పిల్లర్లు, జనరేటర్ రూం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.69.88 లక్షలను చెల్లించారు. నిధులు విడుదల అయితే తప్ప మిగిలిన పనులు చేపట్టేది లేదని కాంట్రాక్టర్ చేతులు ఎత్తేయడంతో 12 ఏళ్ల క్రితం ప్రారంభమైన కళాభవనం నిర్మాణ దశలోనే ఉంది. ఏళ్లు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా తూర్పు ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడంతో అసంపూర్తిగా ఉన్న పిల్లరు ఆకాశాన్ని చూస్తున్నాయి. నిధులు లేని కారణంగానే పనులు పూర్తిచేయలేక పోతున్నామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**నిధులు తేవడంలో ప్రజాప్రతినిధులు విఫలం**

రూ.12 కోట్లతో చేపట్టిన కాళోజీ కళా క్షేత్రం నిర్మాణ వ్యయం సుమారు రూ.100 కోట్లకు పెరిగింది. వరంగల్ పశ్చిమ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించి పూర్తి చేసి ప్రారంభించుకున్నారు. రూ.నాలుగు కోట్ల వ్యయంతో చేపట్టిన కళాభవనానికి నిధులు తేవడంలో జిల్లాతోపాటు తూర్పు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు వస్తున్న వందల కోట్ల రుపాయలతో వృథా పనులు చేస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

**మూడుసార్లు శంకుస్థాపనలు..**

వరంగల్ పోచమ్మమైదాన్‌సమీపంలో మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ (కళాభవనం)కు ఇప్పటికీ మూడుసార్లు శంకుస్థాపనలు చేసినా పూర్తికాలేదు. మినీ రవీంద్రభారతిని పూర్తిచేయాలని జిల్లాలోని కళాకారులు పలుమార్లు అధికారులు, నాయకులను కోరినా పట్టించుకోలేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణం బేస్‌మెంట్‌తో ఆగిపోయింది.

**హామీలకే హరిత హోటల్..**

కళాభవనం స్థలంలో హరిత హోటల్ నిర్మించాలని మూడేళ్ల క్రితం అప్పటి తూర్పు ఎమ్మెల్యే నరేందర్ సూచనల మేరకు అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్థలాన్ని పరిశీలించారు. వరంగల్ తూర్పులో కళాభవనం నిర్మించాలని సాంస్కృతిక కళాకారులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కళాభవనంతోపాటు హరిత కాకతీయ హోటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

**వరంగల్‌లో లేని ఆడిటోరియాలు..**

వరంగల్, హనుమకొండ జిల్లాల ఏర్పాటుతో ఆర్ట్స్ కళాశాల, నేరెళ్ల వేణుమాధవ్, పోతన ఆడిటోరియాలతోపాటు ఇటీవల రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం హనుమకొండ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. వరంగల్ జిల్లా కేంద్రమైన వరంగల్ తూర్పులో ఆడిటోరియాలు లేకుండా పోయాయి. జిల్లా సమీక్షలు హనుమకొండ లేదా ఏదైనా ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల మెగా జాబ్‌మేళాను వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఎంకే నాయుడు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. స్థలం సరిపోక వచ్చిన నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కళాభవనం పూర్తయితే జిల్లాలో తమకు ఆదరణ లభిస్తుందనే ఆశతో జిల్లాలోని కళాకారులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన ఈ భవన నిర్మాణ పనులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోపాటు ఈభవన నిర్మాణం కోసం కృషిచేసిన ఎమ్మెల్సీ సారయ్య సైతం అదే పార్టీలో ఉన్నారు. ఇప్పటికైనా కళాభవన నిర్మాణంపై దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**



కళలకు సంబంధించిన కార్యక్రమాలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అదే విధంగా వరంగల్‌లో ప్రత్యేకంగా కళావేదిక లేకపోవడం, సంస్థలు రాకపోవడంతో కళాకారులు దూరం వెళ్లి ప్రదర్శనలు ఇవ్వాల్సి వస్తోంది. శిక్షణ అకాడమీలు ఒకే సమయంలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే ఆడిటోరియం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి కళాభవనం నిర్మాణాన్ని పూర్తిచేయించాలి.
**– ఆడెపు రవీందర్, శ్రీబాలాజీ క్రియేషన్స్ అధినేత**

# దెబ్బతిన్న పంటల సర్వే చేపట్టాలి

- జాతీయ రహదారిపై ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపురం: వడగండ్ల వర్షాలతో దెబ్బతిన్న పంటల సర్వే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఖానాపురంలో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు, బాధిత రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. రైతులు సర్వే కోసం ఎదురుచూస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదని వ్యవసాయ అధికారులు, ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తూ బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఈ సందర్భంగా రైతులు ఇరుకు దేవేందర్‌రావు, రవి, వల్లెపు శ్రీనివాస్, బంధారపు శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. వడగండ్ల వర్షాలతో రైతులు పంటలను తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాల పేరుతో తప్పుడు నివేదికలు పంపి రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. పాకాల ఆయకట్టు కింద వరి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన పంటల సర్వే చేపట్టి రైతులకు పరిహారం అందించాలన్నారు. నష్టపోయిన పంటలను అధికారులు కనీసం పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి సంఘటనా స్థలానికి చేరుకొని నాయకులు, రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమించాలని సూచించారు. సర్వేపై హామీ లభిస్తేనే విరమిస్తామని తెలపడంతో ఎస్సై రఘుపతి వెంటనే తహసీల్దార్‌తో ఫోన్‌లో బీఆర్‌ఎస్ నాయకులను మాట్లాడించారు. అనంతరం రాస్తారోకో విరమించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వద్దె రాజశేఖర్, భూస అశోక్, బాలు, శ్రీను, బాలునాయక్, సోమయ్య, పూలు, తదితరులు పాల్గొన్నారు.

## బాలుడిని ఢీకొన్న లారీ..

● అక్కడికక్కడే చిన్నారి దుర్మరణం ● పుల్లయ్యబోడుతండా వద్ద ఘటన


అనిల్(ఫైల్)

**నర్సంపేట:** రోడ్డు పక్కన నిలబడిన ఓ బాలుడిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం పుల్లయ్యబోడుతండా గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య వెంకన్న, జ్యోతి దంపతుల కుమారుడు అనిల్(9) అయోధ్యపురం ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. వెంకన్న, జ్యోతి దంపతుల ఇల్లు తండా ప్రధాన రహదారి పక్కన ఉంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గూడూరు మండలం అయోధ్యపురం క్రషర్ మిల్లు నుంచి ఓ లారీ నెక్కొండ వైపునకు వెళ్తోంది. పుల్లయ్యబోడుతండా సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన నిలబడిన అనిల్‌ను ఢీకొంది. దీంతో బాలుడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీనిని గమనించిన తండావాసులు లారీని ఆపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను చితకబాదారు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108లో నర్సంపేటకు తరలించారు. అప్పటి దాకా కళ్ల ముందే కదలాడిన కొడుకు విగతజీవిగా పడి ఉండడంతో ఆ చిన్నారి మృతదేహంపై పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బిడ్డా లే.. బిడ్డా లే.. అంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ ఘటనపై బాలుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

## అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు..

● యువకుడి మృతి ● తిర్లాపురంలో ఘటన


శివకుమార్ (ఫైల్)

**గార్ల:** కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి గార్ల మండలం తిర్లాపురం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిర్లాపురం గ్రామానికి చెందిన ఒంటెపాక శివకుమార్(23) తన స్నేహితులు నరేశ్, ప్రకాశ్‌తో కలిసి కారులో గార్ల నుంచి తిర్లాపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ ప్రకాశ్ కారును అతివేగంగా నడుపుతూ డబ్బాలమోరీ వద్ద రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ఒక్కగానొక్క కొడుకు కారు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి సావిత్రి.. కుమారుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె. రియాజ్‌పాషా తెలిపారు.

## వడదెబ్బతో మహిళా కూలీ మృతి


సుశీల(ఫైల్)

**గార్ల:** వడదెబ్బతో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ఈఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం జీవంజిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాదంపూడి సుశీల (57) గార్ల జీపీ గండితండా గ్రామ సమీపంలో మిరపతోటలో కాయలు ఏరేందుకు వెళ్లింది. ఈక్రమంలో నీళ్లు తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలింది. సహ కూలీలు వచ్చి సీపీఆర్ చేసినా అప్పటికే మృతిచెందింది. కాగా, మృతురాలి భర్త 15 ఏళ్ల క్రితం చనిపోగా రోజూ కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. మృతురాలి ఒక కూతురు సంతానం. ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## వేలుబెల్లిలో వృద్ధురాలు..


మల్లమ్మ(ఫైల్)

**కొత్తగూడ:** వడదెబ్బతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వేలుబెల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం, వడగాలులు వీస్తుండడంతో గ్రామానికి చెందిన బాసాని మల్లమ్మ(75) మంగళవారం వడదెబ్బకు గురై కుప్పకూలింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి కుమారుడు కట్టయ్య ఉన్నాడు.

## గుండెపోటుతో భక్తుడు మృతి

● కాళేశ్వరాలయ ఆవరణలో ఘటన ● కాసేపు ఆలయం మూసివేత
● సంప్రోక్షణ తర్వాత యథావిధిగా పూజలు

**కాళేశ్వరం:** జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థాన ఆవరణలో ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన రాంపల్లి కనుకయ్య(72) కుటుంబ సభ్యులతో కలసి కాళేశ్వరం వచ్చాడు. కుమారుడు కాలసర్పనివారణ పూజలు చేసుకుంటుండగా..మృతుడు ఆలయ ఆవరణలోని ఓ హోటల్ వద్ద కూర్చొని మాట్లాడుతుండగానే ఛాతీలో నొప్పితో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

**కాసేపు ఆలయం మూసివేత..**

కనుకయ్య ఆలయ ఆవరణలో మృతి చెందిన విషయం దేవస్థాన అధికారులకు తెలియడంతో ఆలయాన్ని ఉదయం 8.10 గంటల నుంచి సుమారు గంటన్నరపాటు మూసివేశారు. ఆ తర్వాత సంప్రొక్షణ జరిపి యథావిధిగా పూజలు పునఃప్రారంభించారు. దీంతో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.


నర్సయ్యకు ప్రథమ చికిత్స చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

## అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలు

**ములుగు రూరల్:** అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం ఉదయం మండలంలోని ఇంచర్ల శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇంచర్ల గ్రామానికి చెందిన నర్సయ్య తన పొలం వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో అడవి పంది దాడి చేసింది. దాడిలో గాయపడిన నర్సయ్యకు 39వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.





# స్టీమ్ టు వందేభారత్..

**172 వసంతాల భారతీయ రైల్వే సుదీర్ఘ ప్రయాణంలో కాజీపేట జంక్షన్ ప్రస్థానం**





● ఏప్రిల్ 16 నుంచి 21వ తేదీ వరకు రైల్వే వారోత్సవాలు
● ప్రతిభ కనబరిచిన వారికి ఏటా అవార్డులు
● కాజీపేట జంక్షన్ నుంచి పలువురు ఎంపిక


కాజీపేట రైల్వే డీజిల్‌లోకోషెడ్ నిర్మాణం..

**కాజీపేట రూరల్ :** భారతీయ రైల్వేకు నేటి (బుధవారం)తో 172 వసంతాలు పూర్తయ్యాయి. దేశంలో మొదటి రైలు 1853 ఏప్రిల్ 16వ తేదీన ముంబాయి–థానే మధ్య 34 కి.మీతో నడిపించారు. భారతీయ రైల్వే ప్రస్థానం మొదటి స్టీమ్ లోకోమోటివ్ నుంచి ప్రారంభమై.. ప్రస్తుతం డీజిల్‌లోకోమోటివ్, హాల్కోలోకోమోటివ్, ఎలక్ట్రిక్ లోకోమోటివ్, వందేభారత్ రైళ్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.

కాజీపేట రైల్వే డీజిల్‌లోకోషెడ్‌ను ఏప్రిల్ 21, 1973లో ప్రారంభించారు. నాటి నుంచి డీజిల్‌షెడ్ దినదినాభివృద్ధి సాధించి భారతీయ రైల్వేలో గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం షెడ్‌లో 240 ట్రాక్షన్, డీజిల్‌లోకోల నిర్వహణతో 715 మంది రైల్వే కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ షెడ్ నుంచి డిప్యుటేషన్‌పై ఇతర దేశాల రైల్వేకు డీజిల్‌షెడ్ కార్మికులు వెళ్తుంటారు. డీజిల్‌షెడ్ ఉత్తమ నిర్వహణ షెడ్‌గా రైల్వే జీఎం, రైల్వే బోర్డు, ఇతర రైల్వే అవార్డులను సొంతం చేసుకుంది.




**కాజీపేట రైల్వే స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం..**

కాజీపేట మీదుగా నిజాం స్టేట్ రైల్వే కంపెనీ లిమిటెడ్ అధికారులు సరుకు రవాణా కోసం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ వరకు సింగిల్‌లైన్ నిర్మించారు. 1904లో కాజీపేట రైల్వే స్టేషన్‌ను చిన్న షెడ్డుతో ప్రారంభించారు. తర్వాత కాజీపేట–సికింద్రాబాద్ రైల్వే లైన్ నిర్మాణం జరిగింది. 1917లో కాజీపేటలో రైల్వే స్టీమ్‌లోకోషెడ్‌ను ఏర్పాటు చేశారు. డీజిల్, ఎలక్ట్రిక్ ఇంజిన్ల వినియోగంతో 1991లో స్టీమ్‌లోకోషెడ్ మూతబడింది. 1923లో కాజీపేట రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారింది. 1917లో విజయవాడ–బల్హార్షా మధ్య కాజీపేట మీదుగా డబుల్‌లైన్ ఏర్పాటైంది. కాజీపేట–బల్హార్షా మధ్య మూడో రైల్వే లైన్ కూడా పూర్తి కావొస్తుంది. కాజీపేట కేంద్రంగా 1992లో ఎలక్ట్రిక్‌లైన్ నిర్మాణం జరిగింది. 1970 వరకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైల్వేతో సంయుక్తంగా ఆర్టీసీ కండక్టర్ల నియామకం చేపట్టింది. అప్పట్లో వీరి కోసం కాజీపేట జంక్షన్‌లో క్వార్టర్స్‌ను కూడా నిర్మించారు. కాజీపేట నుంచి రోజూ 170 రైళ్ల రాకపోకలు, 15 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు రూ.సుమారు 12 లక్షల ఆదాయం వస్తోంది. కాజీపేట కేంద్రంగా సుమారు 5 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. కాజీపేట యంత్రాంగం బల్హార్షా మాణిక్ ఘర్, విజయవాడ వద్ద కొండపల్లి, కరీంనగర్ రూట్‌లో జగిత్యాల, సికింద్రాబాద్ రూట్‌లో భువనగిరి వరకు విస్తరించి ఉంది. ప్రస్తుతం కాజీపేట రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీం రీ–డెవలప్‌మెంట్ వర్క్స్‌తో ప్రపంచస్థాయి రైల్వే స్టేషన్‌గా అత్యాధునీకరిస్తున్నారు. కొన్ని నెలల్లో కాజీపేట కేంద్రంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్‌లు ప్రారంభం కానున్నాయి. దీంతో కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.


కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ నిర్మాణం..

కాజీపేటలో 2004లో రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ నిర్మాణం జరిగింది. మొదట ఈ షెడ్ 100 లోకోమోటివ్‌ల నిర్వహణ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 205 లోకోల నిర్వహణతో సుమారు 420 మంది రైల్వే సిబ్బందితో షెడ్ నిర్వహణ జరుగుతోంది. దినదినాభివృద్ధి చెంది ఈ షెడ్ దక్షిణ మధ్య రైల్వేలో ప్రత్యేక గుర్తింపు సాధించి ఎన్నో రైల్వే అవార్డులు కైవసం చేసుకుంది.

**మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టాలపైకి రైళ్లు..**

సాంకేతిక విప్లవం దినదినాభివృద్ధి చెంది స్టీమ్‌లోకోమోటివ్ నుంచి డీజిల్‌లోకోమోటివ్, డబ్ల్యూడీఎం–2, 3, 4, 6 (కంప్యూటరైజ్డ్‌లోకోమోటివ్), తర్వాత ఎలక్ట్రిక్ లోమోటివ్, ఎలక్ట్రిక్‌లోకోమోటివ్‌లో అమెరికా టెక్నాలజీతో డబ్ల్యూఏపీ–2, 4, 7, డబ్ల్యూఏజీ– 5, డబ్ల్యూఏపీ–12 లోకోమోటివ్‌లు వచ్చాయి. తర్వాత వందేభారత్ రైలు 130 కేఎంపీహెచ్ స్పీడ్‌తో పట్టాలపై పరుగులు పెడుతోంది. రైల్వే శాఖ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్యాసింజర్ నుంచి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టి తక్కువ ఖర్చుతో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తుంది. 1853, ఏప్రిల్ 16న మొదటి రైలు ప్రారంభమైనప్పటి నుంచి ఏటా రైల్వే వీక్ అవార్డుల వారోత్సవాల పేరిట విధుల్లో ప్రతిభ కనబరిచిన రైల్వే అధికారులు, కార్మికులకు అవార్డులు, నగదు పురస్కార్, ప్రశంస పత్రాలు ప్రదానం చేసి వారిని ప్రోత్సహిస్తోంది. కాజీపేట జంక్షన్ నుంచి కూడా ఈ ఏడాది పలువురు రైల్వే అవార్డులకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

## పోక్సో కేసులో నేరస్తుడికి మూడేళ్ల జైలు

**వరంగల్ లీగల్ :** తనను ప్రేమించాలని, లేనిపక్షంలో చంపుతానని ఓ బాలికను బెదిరింపులకు గురిచేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన పసునూరి రఘుకు 3 సంవత్సరాల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు (పోక్సో కోర్టు) జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. మడికొండకు చెందిన ఓ బాలిక పదోతరగతి చదువుతోంది. రోజు బస్‌లో స్కూల్‌కు వెళ్లి వచ్చేది. జనవరి 19, 2023న స్కూల్‌కు వెళ్లకుండా ఏడుస్తుండగా తల్లిదండ్రులు ప్రశ్నించారు. దీంతో స్కూల్ బస్ డ్రైవర్ పసునూరి రఘు తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడని తల్లిదండ్రులకు తెలిపింది. తండ్రి ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం నిరుపణకావడంతో నేరస్తుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. ఈ కేసును సీఐ పి.కిషన్, ఎస్సై ఏ.నర్సింహారావు పరిశోధించగా లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి నీరజ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ వీరగోని రాజేశ్, సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.25 వేలు చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను జడ్జి ఆదేశించారు.

## పోలీసులు వేధిస్తున్నారని యువకుడి ఆత్మహత్యాయత్నం

**ఎంజీఎం :** ధర్మసాగర్ పోలీసులు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన వరంగల్ పోతన నగర్‌కు చెందిన సింగరాపు రాజేశ్ మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా తన భార్య విజయతో రాజేశ్ కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విజయ తన పుట్టినిల్లు ధర్మసాగర్‌కు వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన రాజేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడే ముందు తన చావుకు తన భార్య విజయ, బావమరిది ఆరూరి వినయ్, మరదలు జ్యోతి, పోలీసులే కారణమంటూ సోషల్ మీడియాలో ఓ ఆడియో పోస్ట్ చేశారు. ఈ ఘటనను గమనించి కుటుంబ సభ్యులు, స్థానికులు రాజేశ్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం రాజేశ్ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## నీతి ఆయోగ్‌లో గంగారం బ్లాక్‌కు మొదటి ర్యాంక్

**గంగారం:** దేశంలో ఆకాంక్షిత (ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం) మండలాల డెల్టా ర్యాంకింగ్స్‌లో తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం అగ్రస్థానం, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం రెండో స్థానంలో నిలిచిందని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం అధికారి శ్రీనాథ్ హాల్కే వెల్లడించారు. మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సూచన మేరకు అన్నిశాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఐదు టీమ్‌లు, 40 సూచికల ద్వారా లోపాలను గుర్తించి మెరుగుపరచడం వల్లే విజయం సాధ్యమైందన్నారు. హెల్త్ అండ్ న్యూట్రీషియన్, విద్య, సామాజికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో అభివృద్ధి సాధించడంతో గంగారం మండలం నీతి ఆయోగ్‌లో మొదటి ర్యాంకు సాధించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ నీతి ఆయోగ్ ప్రకటించిన డిసెంబర్ మూడో త్రైమాసిక ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) డెల్టా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే గంగారం బ్లాక్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. భారతదేశంలో అత్యంత అభివృద్ధి చెందిన బ్లాక్‌లలో పాలనను మెరుగుపర్చడం, జీవన నాణ్యతా ప్రమాణాలను పెంచడం లక్ష్యమన్నారు. బ్లాక్‌ల పనితీరు, సూచికల పురోగతిపై ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుందన్నారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల సంబంధిత అధికారులు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పనిచేసి అభివృద్ధికి బాటలు వేయాలని సీతక్క కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

● తీర్పు వెలువరించిన జడ్జి నారాయణబాబు



**కాళేశ్వరం:** హత్యకేసులో నిందితుడికి భూపాలపల్లి జడ్జి నారాయణబాబు రూ.10వేల జరిమానా, జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా సీతానాగారం గ్రామానికి చెందిన సంగిశెట్టి కిశోర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బ్రహ్మణపల్లి ఇసుక క్వారీలో సూపర్ వైజర్‌గా పని చేస్తూ ఉండేవాడు. 2018లో కిశోర్ స్నేహితుడు, ఇసుక క్వారీ ఇన్‌చార్జ్‌గా పనిచేసే ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరానికి చెందిన చోడవరపు నర్సింహామూర్తి మహదేవపూర్ మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన యువతి గోగుల లలితను ప్రేమ వివాహం చేసుకోవడానికి విజయనగరం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆ యువతి తమ్ముడు గోగుల విజయ్ 2018 ఆగస్టు 26న నర్సింహామూర్తికి సహకరించాడనే కోపంతో కిశోర్‌ను గొడ్డలిలో నరికి చంపాడు. ఈ విషయమై మృతుడి తండ్రి సంగిశెట్టి దుర్గారావు మరుసటి రోజు 27న మహదేవపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్సై డి. విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి మహదేవపూర్ సీఐ రంజిత్ కుమార్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత సీఐగా వచ్చిన అంబటి నర్సయ్య నిందితుడిపై చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్సై వివరించారు.

## పీఠాధిపతుల పుష్కర స్నానాలు

**కాళేశ్వరం:** జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేయనున్నారు. పుష్కర ప్రారంభం మే 15న మొదటి రోజు శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్‌నుంచి మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారు. మూడవ రోజు మే 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, మే18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, మే 19న నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, మే 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి వార్లు పుష్కర స్నానం ఆచరిస్తారని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

## యథావిధిగా కేయూ డిగ్రీ సెమిస్టర్లు

● ఫీజు చెల్లించిన కళాశాలల విద్యార్థులకే పరీక్షలు
● వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం నిర్ణయం

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బి ఒకేషనల్, బీసీఏ 2,4,5,6వ సెమిస్టర్ల పరీక్షలు యథావిధిగా ఇప్పటికే ప్రకటించిన టైంటేబుల్ ప్రకారమే ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. కేయూ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ప్రైవేట్, అటానమస్ కళాశాలలు కలిపి 292 వరకు ఉండగా అందులో ఆయా సెమిస్టర్ల పరీక్షల ఫీజులు కేవలం 103 కాలేజీలు మాత్రమే పరీక్షల విభాగానికి చెల్లించారు. ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు తమకు ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇంకా విడుదల చేయలేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాము పరీక్షలు నిర్వహించబోమని ఇప్పటికే యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల నుంచి అన్ని కళాశాలలు కూడా పరీక్షల ఫీజులు ఇప్పటికే వసూలు చేశారు. అయితే ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగా పరీక్షలు నిర్వహించబోమని భీష్మించుకుని విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు పరీక్షల విభాగానికి చెల్లించడం లేదు. ఇప్పటివరకు నామినల్ రూల్స్ కూడా పంపలేదు. ఈ క్రమంలో మంగళవారం యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, పరీక్షల విభాగం అధికారులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం సమావేశం నిర్వహించారు. ఇందులో ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు డిగ్రీ వివిధ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21నుంచి యథావిధిగా ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ ప్రకటించారు. ఈ రెండు మూడురోజుల్లో మిగతా కాలేజీల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే ఆ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. లేనిపక్షంలో పరీక్షలు నిర్వహించబోమని రాజేందర్ తెలిపారు. కాగా, ఫీజులు చెల్లించి పరీక్షల నిర్వహణకు మిగతా కాలేజీల యాజమాన్యాలు ముందుకువస్తాయా లేదా వేచి చూడాల్సిందే.

## ‘మత్తు’ తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

● 10 కిలోల గంజాయి, 2 కిలోల హాశీష్ ఆయిల్ స్వాధీనం
● వివరాలు వెల్లడించిన డీసీపీ షేక్ సలీమా


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ షేక్ సలీమా

**వరంగల్ క్రైం :** గంజాయి, హాశీష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన 10 కిలోల గంజాయి, సుమారు రూ.25 లక్షల విలువైన 2 కిలోల హాశీష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. డీసీపీ కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన సుధాకర్, కోటగిరి సాయివినయ్ అలియాస్ వినయ్ 2023లో తన స్నేహితుడు వరుణ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి వెళ్లి గంజాయి తీసుకొస్తుండగా డొంకరాయి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఇక్కడ (జైలు) ములుగుకు చెందిన లావుడ్యా రవీందర్‌కు తాను గంజాయి అమ్ముకుంటానని చెప్పాడని పేర్కొంటూ ఇటీవల సుధాకర్‌పై దాడిచేయగా సాయి వినయ్‌పై హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదైంది. అనంతరం సాయి వినయ్‌ను ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించగా అక్కడ హరి, కబీర్ సింగ్ ఇద్దరు పరిచయమై సాయి వినయ్ ఫోన్ నంబర్ తీసుకున్నారు. మూడు వారాల క్రితం హరి.. సాయివినయ్‌కి ఫోన్ చేసి తన దగ్గర హాశీష్ ఆయిల్ ఉందని చెప్పాడు. దీనిని సిగరెట్లకు పూసి తాగితే కిక్కు వస్తుందని, ఇది కిలో రూ. 12.50 లక్షల వరకు ఉంటుందని చెప్పి తన అన్న రామ్మూర్తి ద్వారా ఆ ఆయిల్‌ను వరంగల్ రైల్వే స్టేషన్‌లో అందజేయగా సాయివినయ్ ఇంట్లో దాచాడు. పది రోజుల క్రితం ములుగు జిల్లా జగ్గన్నపేట అన్నంపల్లి తండాకు చెందిన ఆటో డ్రైవర్ లావుడ్యా రవీందర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమర్ సింగ్ తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్.. 12 కిలోల ఎండు గంజాయి తీసుకుని సాయి వినయ్‌కు ఇవ్వగా దానిని కూడా తన ఇంట్లో దాచాడు. అనంతరం సాయి వినయ్.. రవీందర్‌కు ఫోన్ చేసి తన దగ్గర హాశీష్ ఆయిల్ ఉందని తెలుపగా రవీందర్, హరిసింగ్ మంగళవారం ఆటోలో సాయివినయ్ ఇంటికి వచ్చారు. అనంతరం ఇద్దరు ఆటోలో, ఒకరు బైక్‌పై వెళ్తుండగా రెడ్డి కాలనీ ప్రాంతంలో పోలీసులకు అనుమానం వచ్చింది. తనిఖీ చేయగా గంజాయి, హాశీష్ ఆయిల్ లభించడంతో ముగ్గురిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించామని, మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు డీసీపీ షేక్ సలీమా తెలిపారు.

## ఉపాధి హామీ పనులకు తాజా మాజీ సర్పంచ్


పని చేస్తున్న రామ్మూర్తి

**కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి తాజామాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి మంగళవారం లాలుతండాజీపీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా అప్పులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి అనేక పనులు చేశానన్నారు. కానీ ఇప్పటి వరకు తనకు బిల్లులు రాలేదన్నారు. మొత్తం రూ.15లక్షల బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఉపాధి హామీ పనులకు వెళ్తున్నానని తెలిపారు.

## భాషాపండితులకు సన్మానం


సన్మానం పొందిన భాషాపండితులు

**విద్యారణ్యపురి:** రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది ఉద్యోగ విరమణ పొందబోతున్న పలువురు భాషాపండితులను టెస్ట్ స్పాట్‌లో సన్మానించారు. మూల్యాంకనం చేపడుతున్న ఫాతిమా హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ వాసంతి మాట్లాడుతూ టెస్ట్ మూల్యాంకనంలో భాగస్వాములైన భాషాపండితుల సేవలను కొనియాడారు. రాష్ట్రీయ భాషా పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ భాషా పండితులు అప్‌గ్రేడ్ కోసం కృషి చేయగా పదోన్నతులు లభించాయని గుర్తుచేశారు. ఆ పరిషత్ బాధ్యులు అంకేశ్వరపు కుమారస్వామి, బి. వెంకన్న, అల్లం నర్సయ్య, సదానందం, భిక్షపతి, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.